# వన్యప్రాణులకు అండగా..




ఖడ్గ మృగం ఎన్‌క్లోజర్ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డు

- జూలో జంతువులు, పక్షులను దత్తత తీసుకుంటున్న దాతలు
- డోనర్ పేరు మీద ప్రత్యేక బోర్డుల ఏర్పాటు
- సందర్శకులను ఆకర్షిస్తూ.. ఆలోచింపజేస్తున్న దత్తత సమాచార బోర్డులు




జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద ఫ్లూయంట్‌గ్రిడ్ లిమిటెడ్ కంపెనీ బోర్డు

ఆరిలోవ: ఇందిరాగాంధీ **జూ పార్కులోని వన్యప్రాణులు**, వివిధ రకాల పక్షులు **సందర్శకులను నిత్యం** అలరిస్తుంటాయి. జూ **పార్కుకు వెళ్లే వారంతా** వాటిని చూస్తూ సరదాగా.. **సందడిగా గడుపుతుంటారు.** ఇక్కడున్న వన్య**ప్రాణులే కాకుండా కొన్ని** బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జూలో వందల కొలది ఉన్న వన్యప్రాణులు, పక్షులకు ఆహారం అందించే బాధ్యతను కొందరు దాతలు తీసుకొని దాతృత్వం చాటుతున్నారు. వన్యప్రాణులపై ప్రేమ, వాత్సల్యం చూపుతూ జూ అధికారులకు సహకరిస్తున్నారు. వాటిని దత్తత తీసుకుంటూ అండగా నిలుస్తున్నారు. నెలకు, ఆరు నెలలకు, **ఏడాదికి చొప్పున ఆహారం అందించేందుకు తమ వంతు బాధ్యతగా సహాయ పడుతున్నారు.**

**బోర్డుల ఏర్పాటు..**

**మంచి ఆలోచన**

జూ పార్కులో తెల్ల పులి, ఖడ్గ మృగం, జిరాఫీ తదితర పెద్ద జంతువులను పలు కంపెనీలు ఏడాది పాటు దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చాయి. మరికొన్ని చిన్న **జంతువులు, పక్షులను కూడా** కొందరు నెల, ఆరు నెలలు పాటు దత్తత తీసుకుని ఆహారం అందిస్తున్నారు. ఏడాది పాటు దత్తత తీసుకున్న జంతువుల ఎన్‌క్లోజర్ల వద్ద దాతల పేర్లు, వన్యప్రాణి చిత్రపటం కలిగిన బోర్డులను జూ అధికా**రులు ప్రత్యేకంగా తయారు** చేసి ఏర్పాటు చేశారు. **అవి జూకు వస్తున్న సం**దర్శకులను ఆకర్షిస్తున్నాయి. **దీంతో తాము** కూడా ఏదో ఒక **వన్యప్రాణిని దత్తత తీసు**కుంటే తమ పేరుతో **కూడా బోర్డు ఏర్పాటు చేస్తా**రనే ఆలోచన వారిలో **కలిగిస్తున్నాయి.**





వైట్ టైగర్ ఎన్‌క్లోజర్ వద్ద ఏఎం/ఎన్ఎస్ ఇండియా లిమిటెడ్ కంపెనీ బోర్డు

### వన్యప్రాణి దత్తత వివరాల బోర్డులు

- ఫ్లూయంట్‌గ్రిడ్ లిమిటెడ్ కంపెనీ జిరాఫీని ఒక ఏడాది పాటు దత్తత తీసుకొంది. ఆ కంపెనీ పేరు, జిరాఫీ చిత్రపటంతో కూడిన బోర్డును దాని ఎన్‌క్లోజర్ వద్ద ఏర్పాటు చేశారు..
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) ఒక ఖడ్గ మృగాన్ని ఏడాది పాటు దత్తత తీసుకుంది. మరో ఏడాది పాటు దత్తత కొనసాగించడానికి ఆ కంపెనీ మళ్లీ ముందుకొచ్చింది. ఖడ్గ మృగం ఉన్న చిత్రపటంపై ఐవోసీఎల్ లిమిటెడ్ పేరుతో బోర్డును దాని ఎన్‌క్లోజర్ వద్ద ఏర్పాటు చేశారు.
- ఆర్సిలోర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎం/ఎన్ఎస్) తెల్ల పులిని ఏడాది పాటు దత్తత తీసుకొంది. తెల్ల పులుల ఎన్‌క్లోజర్ వద్ద ఆ కంపెనీ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.
- వీటితోపాటు మరికొందరు ఏడాది, ఆరు నెలలు, మూడు నెలలు, నెల, ఒక్క రోజు కూడా ఇక్కడ వన్యప్రాణులకు ఆహారం అందించడానికి దత్తత తీసుకున్నారు.

### వన్యప్రాణుల దత్తతకు ముందుకు రావాలి

జూ పార్కులోని వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలి. వాటికి ఆహారం అందించడంలో భాగస్వాములు కావాలి. ఇప్పటికే కొందరు వ్యక్తిగతంగా ముందుకొచ్చి చిన్న జంతువులను, పక్షులను వారం, నెల కాలానికి ఆహారం అందించడానికి దత్తత తీసుకున్నారు. ఇంకొన్ని సంస్థలు, కంపెనీలు జిరాఫీ, తెల్ల పులి, ఖడ్గ మృగం తదితర పెద్ద జంతువులను దత్తత తీసుకున్నాయి. ఎక్కువ మంది దాతలు స్పందించి దత్తతకు ముందుకొస్తే వణ్యప్రాణులకు సహకరించిన వారవుతారు.

– జి.మంగమ్మ, జూ క్యూరేటర్

## నేడు ఏయూలో పెన్షనర్స్ డే వేడుకలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొలగాని అప్పారావు, సి.నాగశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూటీఎల్ఎన్ సభా హాల్‌లో ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఏయూలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన 75 ఏళ్లు నిండిన వారికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. నాన్ టీచింగ్ పెన్షనర్ల అంతా హాజరు కావాలని కోరారు.

## ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన



స్థానికులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్న శానిటరీ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులో శానిటరీ సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం జోన్‌-2 ఏఎంహెచ్‌వో ఎస్.కిశోర్‌కుమార్ పర్యవేక్షణలో విశాలాక్షినగర్‌లో స్థానికులకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలను వివరించారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ కాలుష్యం నుంచి రక్షించడంలో ప్రజలు సహకరించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ప్లాస్టిక్ సంచులు వాడవద్దని సూచించారు. వాటికి బదులుగా క్లాత్ బ్యాగులను స్థానికులకు పంపిణీ చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు, సచివాలయం, పబ్లిక్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విభాగాధిపతి సి.వి.నాయుడుకు అభినందన



ఆచార్య సి.వి.నాయుడిని అభినందిస్తున్న ఏయూ వీసీ, ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడిని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులు సోమవారం అభినందించారు. ఇటీవల ఇండియన్ మీటరాలాజికల్ సొసైటీ నుంచి 'ఫెలో ఆఫ్ ఇండియన్ మెటీరాలాజికల్ సొసైటీ' పురస్కారాన్ని ఆచార్య నాయుడు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను వీసీ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. బోధన, పరిశోధన రంగానికి అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ పురస్కారం అందజేశారు. గతంలో ఆచార్య నాయుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు స్వీకరించారు. ఆయన పర్యవేక్షణలో 29 మంది డాక్టరేట్ అందుకున్నారు. 80కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించారు.

### సాంప్ పరీక్ష పేపర్లను పాఠశాలలకు పంపాలి

విశాఖ విద్య: ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో ఉన్నత పాఠశాలల్లో జరగబోయే సెల్ఫ్ అసెస్‌మెంట్(సాంప్) పరీక్షల పేపర్లను నేరుగా స్కూళ్లకు సరఫరా చేయాలని ఉత్తరాంధ్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి ఒక ప్రకటనలో సూచించారు. పరీక్ష రోజున ఉదయం, సాయంత్రం ప్రధానోపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌కు గంట ముందు వెళ్లి పేపర్లు తీసుకుని పరీక్ష నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం సరికాదన్నారు. పరీక్ష పేపర్లు లీకైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామనడం సమంజసంగా లేదని పేర్కొన్నారు. 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో పాఠశాలలు ఉన్నాయని, అంత దూరం నుంచి పేపర్లు పట్టుకెళ్లడం కూడా భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. విద్యా శాఖాధికారులే నేరుగా పాఠశాలలకు పరీక్ష పేపర్లు పంపించే కార్యక్రమం చేపట్టాలని విజయగౌరి సూచించారు.

### వ్యక్తి అదృశ్యం



నవీన్‌కుమార్‌రెడ్డి

టీచ్‌రోడ్డు: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై కేసు నమోదైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. చినవాల్తేరుకు చెందిన కేత నవీన్‌కుమార్‌రెడ్డి ఈ నెల 11న ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటి నుంచి కారులో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్పందించక పోవడంతో అతడి భార్య దివ్యభారతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్‌కు అప్పగించారు. నవీన్ ఆచూకీ తెలిస్తే త్రీ టౌన్ పీఎస్‌లో సంప్రదించాలని హెచ్‌సీ కోరారు.

### ఆటో డ్రైవర్ల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆటో డ్రైవర్ల కోసం ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీటీయూ ప్రతినిధి పడాల గోవింద్ కోరారు. ఆటో ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఆటో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మధురెడ్డి వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసే 21, 31 జీవోలను రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ధరలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న పోలీస్, ఆర్టీవో ఈ-చలానాలు రద్దు చేయాలన్నారు. డ్రైవర్లకు వాహనమిత్ర పథకం వెంటనే అమలు చేయాలన్నారు. రవి, మురళీ, అప్పారావు, నాగేశ్వరరావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రజా సహకారంతో కాలుష్య రహిత నగరం



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు సహకరించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని క్యాంప్ ఆఫీస్ నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రివచ్చని పేర్కొన్నారు.

## వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

ఆరిలోవ: భారత నాస్తిక సమాజం(భానాస), సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు భానాస కేంద్ర కమిటీ సభ్యుడు రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయగోపాల్‌తోపాటు భానాస, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్, పౌర హక్కులు, పెరియార్, అంబేడ్కర్, పూలే తదితర భావసారూప్యత గల వారి ఉద్యమాలు, అనుభవాలను వ్యాస రూపంలో రాసి వాట్సాప్‌కు పంపించాలని కోరారు. వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి కొత్త ఏడాది ఫిబ్రవరి 9న జరగనున్న జయగోపాల్ వర్ధంతిని పురస్కరించుకొని రూపొందించదలచిన పుస్తకంలో ముద్రిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 లోగా 98660 78486 వాట్సాప్ నంబర్‌కు వ్యాసాలను పంపాలన్నారు. వ్యాసాలు పంపేవారి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు కూడా జత చేయాలని చెప్పారు.

## మళ్లీ గందరగోళమే..

- ఇరుకు ప్రదేశంలో రెవెన్యూ సదస్సు
- ఇబ్బందులు పడిన దరఖాస్తుదారులు



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు వినతులు అందిస్తున్న స్థానికులు



సదస్సు వద్ద ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్

ఆరిలోవ: ఆరిలోవలో జరిగిన రెవెన్యూ సదస్సులు గందరగోళం మధ్య సాగాయి. ఈ నెల 14న రవీంద్రనగర్ ఆఖరి బస్టాప్ వద్ద ఇరుకు స్థలంలో ఏర్పాటు చేసిన సదస్సులో దరఖాస్తుదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ఆరిలోవ టీబీసీ పాయింట్ వద్ద సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా అదే పరిస్థితి నెలకొంది. 12, 13 వార్డుల పరిధిలోని ప్రజల కోసం రూరల్ రెవెన్యూ అధికారులు టీబీసీ పాయింట్ సమీపాన హిందీ కాలేజీ రోడ్డులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తహసీల్దార్ పాల్‌కిరణ్, జోన్‌-2 కమిషనర్ ఫణికుమార్, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు, ఇళ్ల పట్టాల్లో తప్పుల సవరణ, 100 చదరపు గజాల లోపల వారికి ఇళ్ల పట్టాలు, కొండవాలు వాసులు దేవస్థానానికి సంబంధించిన సమస్యలపై దరఖాస్తులను అధికారులకు ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు ప్రాధాన్యం గురించి తెలియజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ 13వ వార్డులో స్థానికులు ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల సమస్యలు, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీవాసుల సమస్యల గురించి అధికారులకు తెలియజేశారు.

**ఇరుకు రోడ్డులో సదస్సు..**

ఇరుకు రోడ్డులో రెవెన్యూ సదస్సు నిర్వహించడంతో దరఖాస్తులు అందజేయడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో అధికారుల వద్దకు చేరుకోవడంతో తోపులాటలు జరిగాయి. మరోపక్క ప్రధాన రహదారిపై టీడీపీ నాయకులు వాహనాలు అడ్డంగా నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వార్డులో అందుబాటులో ఉన్న విశాలమైన మైదానాలను విడిచిపెట్టి పబ్లిసిటీ కోసం టీడీపీ నాయకులు ఇరుకు రోడ్డులో సదస్సు జరిపి ఇబ్బంది పెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఇరుకు స్థలానికి రప్పించి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

## మత్స్య ఉత్పత్తుల భద్రతపై వర్క్‌షాప్



శిక్షణ మాన్యువల్ విడుదల చేస్తున్న ఎన్ఐవో చీఫ్ సైంటిస్ట్ శర్మ



శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ఏయూక్యాంపస్: మత్స్య ఉత్పత్తుల భద్రతను పెంచడంలో మైక్రోబయాలాజికల్ టెస్టింగ్ అనే అంశంపై ఐసీఏఆర్‌-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎస్‌సీఎస్‌పీలో భాగంగా ఈ నెల 20 వరకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. చేపలు, వాటి ఉత్పత్తుల భద్రత, నాణ్యతను పెంచేలా విద్యార్థులకు అవసరమైన ప్రత్యక్ష అవగాహనతో కూడిన నైపుణ్య శిక్షణ తరగతులను సీఎస్ఐఆర్‌-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వి.వి.ఎస్.ఎస్.శర్మ ప్రారంభించారు. ఫుడ్ మైక్రోబయాలజీ రంగంలో నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించడంపై సీఐఎఫ్‌టీ అధికారులను ఆయన అభినందించారు. ఈ అంశంపై ప్రత్యేక సంచికను విడుదల చేసి శిక్షణలో పాల్గొన్న వారికి అందించారు. ఐసీఏఆర్‌-సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ యు.శ్రీధర్ తమ కేంద్రం నుంచి నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూదనరావు శిక్షణ ఉద్దేశం, ప్రత్యేకతలను తెలియజేశారు. ఐదు రోజుల శిక్షణలో భాగంగా చేపల నమూనాలను పరీక్షించి, టోటల్ బాక్టీరియా కౌంట్, సాల్మొనెల్లా, విబ్రియో కొలరా తదితర హానికర బాక్టీరియాలను గుర్తిస్తామన్నారు. విభిన్న సాంకేతిక విధానాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తామని చెప్పారు. సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ డాక్టర్ కె.అహ్మద్ బాషా, టెక్నికల్ ఆఫీసర్ ఎం.ప్రసన్నకుమార్ తదితరులు ప్రసంగించారు. శిక్షణ కార్యక్రమంలో ఏయూ బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ఎంవీపీకాలనీ: రామానుజన్ మ్యాథ్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో ఎంవీపీ భాష్యం స్కూల్ విద్యార్థిని జె.లిఖిత ప్రథమ స్థానం సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ శిల్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి చదువుతున్న లిఖిత రాష్ట్ర స్థాయిలో, 9వ తరగతి విద్యార్థి కె.యశ్వంత్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో విజేతలు మెడల్, ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందించారు.

## ఎలక్ట్రికల్ వాహనాల తయారీకి సహకారం



అభిషేక్ కిషోర్‌కు ప్రాజెక్టు వివరాలు తెలియజేస్తున్న జైభరత్

టీచ్‌రోడ్డు: ఎలక్ట్రికల్ వాహనాల తయారీకి చేయూత అందిస్తామని రాష్ట్ర ఇండస్ట్రీస్ డైరెక్టర్ అభిషేక్ కిషోర్ తెలిపారు. సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన ఎంఎస్ఎంఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను ధరతి బ్రో ఎలక్ట్రికల్ స్కూటర్ సంస్థ చైర్మన్ డాక్టర్ డి.జై భరత్ కలిసి తమ ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. ఎలక్ట్రికల్ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని డైరెక్టర్ అభిషేక్ కిషోర్ హామీ ఇచ్చారు. విశాఖ నుంచి మొదటిసారిగా రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ వాహనం బ్రో స్కూటర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తోపాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు వల్ల అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు.

## ఏయూను సందర్శించిన అమెరికన్ ఎంబసీ అధికారులు



అమెరికన్ ఎంబసీ ప్రతినిధులతో సమావేశమైన రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం అమెరికన్ కాన్సులేట్ అధికారులు సందర్శించారు. హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయం అమెరికన్ కార్నర్స్ ప్రోగ్రామింగ్ కో ఆర్డినేటర్ మెలిసా నందుల, అమెరికన్ కౌన్సులేట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కాలే నందుల ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఏయూలో అమెరికన్ కార్నర్ సాధిస్తున్న ప్రగతి, నిర్వహించిన కార్యక్రమాలను వారికి వివరించారు. అమెరికన్ కార్నర్‌లో నిర్వహించే విభిన్న కార్యక్రమాలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరు ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించారు. అక్కడి వసతులు, నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను తెలుసుకుని ప్రశంసించారు.

## చైర్మన్ దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు



చైర్మన్ కొనకళ్ల నారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కోరినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి తెలిపారు. చైర్మన్ కార్యాలయంలో సోమవారం ఏపీపీటీడీ ఎన్ఎంయుఏ ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో సమస్యలు పరిష్కరించడం ఎంతైనా మంచిదని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి అంచెలంచెలుగా సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొనడం ఆనందకరమన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, విజయవాడ జోనల్ కార్యదర్శి అడపా రామారావు, కేంద్ర కార్యాలయ కార్యదర్శి ఎన్.వి.కుమార్, విజయవాడ జిల్లా కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారన్నారు.

## ఏయూతో కలిసి పనిచేయండి

విశాఖ విద్య: యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా(డేవిస్) స్టెమ్ సెల్ బయాలజిస్ట్ ప్రొఫెసర్ చార్లెస్ సోమవారం ఏయూను సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో అతిపెద్ద యూనివర్సిటీగా నిలుస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. ఏయూతో కలిసి పనిచేయాలని, తమ విద్యార్థులకు బోధించాలని ప్రొఫెసర్ చార్లెస్‌ను రిజిస్ట్రార్ ఆహ్వానించగా.. ఆయన సాదారంగా స్వీకరించారు. ప్రొఫెసర్ చార్లెస్ తదితరులను ఏయూ తరఫున రిజిస్ట్రార్ సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. ఏయూలో ఫుడ్ సైన్స్, ఫార్మసీ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు, నూతన ప్రయోగశాల గురించి చార్లెస్‌కు వివరించారు. పరిశోధన, బోధన రంగాల్లో కలిసి పనిచేయాలని కోరారు. ప్రొఫెసర్ చార్లెస్ తదితరులను ఏయూ తరఫున రిజిస్ట్రార్ సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. అమెరికాకు చెందిన పారిశ్రామిక వేత్త డాక్టర్ మైక్, ఏయూ పూర్వ విద్యార్థి, పారిశ్రామిక వేత్త శ్రీ వెంకట్, ఆచార్య బి.భరతలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## విశాఖలో 2 లక్షలకుపైగా బీజేపీ సభ్యత్వాలు

ఎంవీపీకాలనీ: బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఆ పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే విశాఖ జిల్లా మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 2 లక్షలకు పైగా సభ్యత్వాలు జిల్లాలో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇందుకు కృషి చేసిన పార్టీ నాయకులను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో పోలింగ్ బూత్ కమిటీల నిర్మాణం కూడా ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ పుట్ట గంగయ్య, పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జ్ ఎన్.వి జయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర

## అమరజీవి త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిదని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, ఆర్ఆర్‌బీ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, యూబీఏ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, డాక్టర్ రవిబాబు, డాక్టర్ పి.గోపాల్‌నాయుడు, ఎం.బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.